కథ

# ఎక్కడికో పరుగు

టెన్త్ రిజల్ట్సొచ్చాయి. పునీత సూసైడ్ చేసుకుంది.

నాలో చిన్న జెర్క్.

అప్పటిదాకా గతమంటూ ఏమీలేని నా వెనక చిన్న నల్లటి చారికలాగా నెలరోజుల గతం చోటుచేసుకుంది. దుఃఖాన్ని ఏడుపుగా వ్యక్తపరచటం మాత్రమే వచ్చిన నాకు బాధపడి మథనపడటం కూడా వచ్చింది.

★ ★ ★

టెన్త్ సిలబస్ పూర్తయింది. ప్రిపరేషన్ హాలీడేస్ యిచ్చారు మాకు. ఫేర్‌వెల్ పార్టీ తీసుకుని గుంపులు గుంపులుగా యివతలికొస్తున్నాం. పన్నెండేళ్ళపాటు చదివిన స్కూల్‌తో అనుబంధం తెగిపోతోందన్న భావన కలిగి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''ఏయ్ స్కూల్ టాపొస్తే యాక్టివా కొనిస్తారట మా డాడీ!'' అంది స్నిగ్ధ వున్నట్టుండి.

''ఓహ్! హౌ నైస్!'' అన్నాను.

''నీకు డెఫినిట్‌గా వస్తుందే!''

''నీకు కాకపోతే యింకెవరికొస్తుందే?''

''పునీత కూడా చాలా పట్టుదలగా వుంది''

''వాళ్ళ డేడీ అందరికీ అప్పుడే చెప్పేస్తున్నారు టాప్‌మార్కు దానికే వస్తుందని. ఈ హాలీడేస్‌లో ట్యూటర్ని కూడా ఎరేంజి చేసారట దానికి.''

''అబ్బా! బోర్. హాలీడేస్‌లోనైనా మన చదువు మనని చదువుకోనివ్వకపోతే ఎలా?''

''దానికి వాళ్ళ డేడీ అంటే చాలా భయం. ఒక్క మార్కు తక్కువొచ్చినా కొడతారట''

చివరి విషయం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. పునీతకీ స్నిగ్ధకీ స్కూల్ ఫస్టుకోసం గొప్ప కాంపిటీషనుంది. చాలాసార్లు పునీతకే వచ్చింది. ఒకటీ అరా మార్కులతో స్నిగ్ధ వెనకపడుతుంటుంది. తనకి రేంకు పోతే ఏడ్చి, కళ్ళనీళ్ళ పర్యంతమౌతుంది పునీత. స్నిగ్ధ ఫీలైనా అంతగా బైటపడదు.

''ఈసారి ఎలాగైనా రేంకు నాదే'' అంది పట్టుదలగా.

స్కూల్ టాపర్‌గా నిలబడితే ఎంత గ్రేట్‌గా వుంటుంది! ప్రిన్సిపాల్ డయాస్ మీదికి పిలుస్తారు. షేక్‌హేండిస్తారు. కేష్ ఎవార్డు, మెమెంటో యిస్తారు. పిల్లలందరూ ఆరాధనగా చూస్తారు. పేరు, ఫొటో స్కూల్ మేగజైన్‌లో ఎప్పటికీ వుండిపోతాయి. ఆ తరువాత దొరికే ప్రివిలిజెస్ నాకు తెలీవు. నా ఆలోచనలు అక్కడే ఆగిపోయాయి. స్నిగ్ధకి కూడా తెలుసని అనుకోను.

''యాక్టివా కోసమేనా..'' అంది తనే మళ్ళీ.

''బెస్టాఫ్ లక్'' అన్నాను.

తనూ నాకు చెప్పింది. అందరం ఒకరికొకరం చెప్పుకున్నాక ఎవరి దారిన వాళ్ళం వెళ్ళిపోయాం. పునీత అప్పటికే వెళ్ళిపోయింది.

★ ★ ★

''స్కూల్ టాప్‌గానో, స్టేట్ రేంకు రావాలనో కోరుకోవడమంటే నీ విజయాన్ని యింకెవరితోనో ముడిపెట్టుకుంటున్నావన్నమాట. అలా కాకుండా ఒక ఇండివిడ్యువల్ గోల్ సెట్ చేసుకుంటే అందులో విజయమే తప్ప పరాజయం వుండదు'' అంది అమ్మ నేను స్నిగ్ధ- యాక్టివా గురించీ, పునీత డేడీ గురించీ చెప్పగానే.

''ఎలా?'' అనడిగాను.

''ప్రీ ఫైనల్స్‌లో నీకెన్నొచ్చాయి?''

చెప్పాను. ''నైంటీ పర్సంటు''

''నైంటీ టూ పర్సంటొచ్చేలా చూసుకో'' అంది అమ్మ.

ఎల్‌కేజీ నుంచీ యిప్పటిదాకా నాకొక్కసారి కూడా ఫస్టు రేంక్ రాలేదు. పర్సంటేజి నైంటీకి తగ్గలేదు. చదువు విషయంలో అమ్మా, నాన్నా నన్నెప్పుడూ కోప్పడలేదు. నైంటీకి తగ్గినప్పుడు మాత్రం బాగా చదవాలి, అని హెచ్చరించేవారు.

క్లాస్‌బుక్స్‌తోపాటు బైటిబుక్స్ కూడా చదవాలనేది అమ్మ. గాంధీ, నెహ్రూ, బోసులాంటివాళ్ళ జీవిత చరిత్రలు, కామిక్స్, పల్నాటియుద్ధం, బొబ్బిలియుద్ధం, రామాయణంలాంటి పుస్తకాలు, ఎలీస్ యిన్ వండర్‌లాండ్, సిండ్రెల్లా, గలివర్ ట్రావెల్స్‌తోపాటు ప్రిన్స్ అండ్ ద పాపర్, నికోలాస్ నికల్‌బై, డేవిడ్ కాపర్ ఫీల్డులాంటి బుక్స్ తాలూకు ఎబ్రిడ్జ్‌డ్ ఎడిషన్స్ నా దగ్గరున్నాయి. అవన్నీ చదివాను. పుస్తకాలే కాకుండా నాకొక హాబీ కూడా వుండాలని మ్యూజిక్ కూడా నేర్పిస్తున్నారు.

★ ★ ★

ఎగ్జామ్స్ మొదలయ్యాయి. డేడీ నన్ను సెంటర్ దగ్గరకి తీసుకెళ్ళారు.

అమ్మ ఎన్నో జాగ్రత్తలు చెప్పింది, ''అక్షరాలకి నగిషీలు చెక్కుతూ కూర్చోకు. తొందర తొందరగా పేపరు ముగించి ఒకటికి రెండుసార్లు రాసింది చెక్ చేసుకో'' అంది.

అమ్మ ఎన్ని చెప్పినా తీరా లోపలికి వెళ్ళే టైముకి నాకు నెర్వస్‌గా అనిపించింది. గేటు దగ్గర చీటీలున్నాయేమోనని చూస్తుంటే యింకా భయమేసింది.

''అంత భయమేమిటే? వచ్చిందంతా రాసి రా. స్కూల్లో హాఫియర్లీ, ప్రీఫైనల్స్ రాయలేదా? అలాగే యిదీను. సివిల్స్ రాసే వాళ్ళు కూడా యింత టెన్షను పడరు'' అన్నారు నాన్న మృదువుగా ధైర్యం చెప్తూ.

నేను నా సీటు వెతుక్కుని కూర్చున్నాను.

నాన్న చెప్పినట్టు స్కూల్ టెస్టుల్లా యిక్కడ ఫెయిర్‌గా జరగటం లేదు. ఇన్విజిలేటర్స్ కొందరు పిల్లలకి ఆన్సర్లు చెప్తున్నారు. ఇంకొందరేమో స్లిప్పులు తెచ్చుకుని కాపీలు కొడ్తున్నారు. మధ్యమధ్యలో చెకింగ్‌కి ఆ సెంటరు ఛీఫ్ వస్తున్నాడు.

''అంత వోపెన్‌గా కాపీలు కొట్టకండమ్మా! స్క్వాడొస్తే పట్టుకుంటారు. మీరు డిబారైనా ఏడాదో రెండేళ్ళో మళ్ళీ పరీక్ష రాసుకోవచ్చు. మా ఉద్యోగాలు వూడితే యింక అంతే'' అన్నాడాయన.

''స్క్వాడ్..ఎప్పుడొచ్చేదీ, ఎలా వచ్చేదీ తెలీదు. సడెన్‌గా వస్తారు. సందు చివర జీపు ఆపి సైలెంటుగా వచ్చేస్తారు. గోడ పక్కనుంచీ మిమ్మల్ని అబ్జర్వు చేస్తారు'' అంటూ ఆయన చెప్తూనే వున్నాడు, గేటు ముందు జీపాగింది. గేటు తియ్యమని వాళ్ళు హారన్ మోగించారు.

''స్క్వాడ్..స్క్వాడ్..'' అనే గుసగుసలు వినిపించాయి. అందరి చేతుల్లో స్లిప్పులు మాయం. ఎవరు ఎట్నించీ పిలిచినా శతాబ్దీ ఎక్స్‌ప్రెస్‌లా పరిగెత్తే మా అటెండరు హంస నడక నడుస్తూ వెళ్ళి గేటు తీసాడు.

స్క్వాడ్ వచ్చింది, వెళ్ళింది.

అందరూ వూపిరి పీల్చుకున్నారు. నేను బాధని పీల్చుకున్నాను.

మొదటిసారిగా తెలిసింది బాధెలా వుంటుందో, దాని సాంద్రత ఏమిటో! సంవత్సరమంతా కష్టపడి చదివి నేర్చుకున్నాను నేను. సునాయాసంగా మార్కులు కొట్టేస్తున్నారు వీళ్ళు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

పేపరలాగే వదిలేసి వెళ్ళిపోవాలనిపించినా, అమ్మ చెప్పే ధైర్యం గుర్తొచ్చి, మళ్ళీ రాయటం మొదలుపెట్టాను. మొదట్లోలా వుత్సాహంగా కాదు, యాంత్రికంగా.

రూమ్‌లో నుంచి బైటికి రాగానే స్నిగ్ధ నా చేతులు పట్టుకుని దాదాపుగా ఏడ్చేసింది.

''ఇదేంటే? స్ట్రిక్టుగా వుంటుందన్నారు. కాపీ చెయ్యనివ్వరన్నారు. పట్టుబడ్తే డిబారౌతామన్నారు. సంవత్సరమంతా తోమి తోమి చదివించారు. రోజుకి పది గంటలూ, పన్నెండు గంటలూ... ఇలా వుంటే నాకింకేం రేంకొస్తుంది?'' అంది.

''నాకూ అలాగే వుంది'' అన్నాను నిరుత్సాహంగా. ఇద్దరం బైటికొచ్చి ఆటో మాట్లాడుకుని యిళ్ళు చేరుకున్నాం.

''ఎలా రాసావు?'' అమ్మ ప్రేమగా నన్ను దగ్గరకి తీసుకుని అడిగింది.


నేను ఎగ్జాం పేడ్ ఓ మూలకి విసిరేసి తన గుండెల్లో ముఖం దాచుకుని ఏడ్చేసాను. అంతదాకా దాచుకున్న దుఃఖం వుప్పెనలా విరుచుకుపడుతుంటే వెక్కిళ్ళమధ్య జరిగింది చెప్పాను.

అమ్మ ఒక్కక్షణం మౌనంగా వూరుకుని, ''అరే ఎందుకా ఏడుపు? నీ చుట్టూ వున్నవాళ్ళు కాపీ కొట్టుకుంటుంటే కొట్టుకోనీ. నీ నైంటీ టూ లోంచీ వాళ్ళైతే తీసుకోరు కదా?'' అంది.

నేను దూరంగా జరిగి తనకేసి ఆశ్చర్యంగా చూసాను. తను నవ్వుతోంది. మళ్ళీ నా వుత్సాహం నాకొచ్చేసింది. గబగబా ఫ్రెష్ అయి అన్నం తినేసాను. కాసేపు టీవీ చూసి, రేపటి ఎగ్జామ్‌కి పుస్తకాలు ముందేసుకున్నాను.

నాన్న ఆఫీసు నుంచీ వచ్చారు. ''ఛ..ఛ..కాపీయింగ్ బాగా జరుగుతోందిట. ఎక్కడ విన్నా అవే మాటలు. అసలీ పరీక్షలకి అర్ధమంటూ లేకుండా పోతోంది. వేస్టాఫ్ టైమ్, వేస్టాఫ్ పబ్లిక్‌మనీ తప్పించి..'' అన్నారు చిరాగ్గా. ఆ వెంటనే, ''స్వీటీ ఎలా రాసిందట?'' అని నా గురించి అడిగారు. అమ్మ చెప్పింది. నేను రాగానే ఏడ్చిన విషయం కూడా చెప్పేసింది.

నాన్న నా దగ్గరకొచ్చారు. ''నీ చదువేదో నువ్వు చదువుకో. నీకొచ్చింది పేపరు మీద పెట్టు. రాస్తున్నప్పుడు తల తిప్పడం అదీ చెయ్యకు. నీ జాగ్రత్తలో నువ్వుండు. ఎవరేనా స్లిప్పనీ నీ మీద పడేస్తారు. లేచి వెంటనే యిన్విజిలేటర్‌కి చెప్పాలి.



బోల్డ్‌గా వుండాలి'' అన్నారు.

నేను తలూపాను.

''ఏడ్చావటెందుకు? ఇవన్నీ కామన్. ఈ మార్కుల్తో వచ్చేదీలేదు. పోయేదీ లేదు. అయినా నీ పర్సంటేజీని నువ్వు పెంచుకుంటూ వెళ్తే లక్కీగా అదే టాప్ మార్కు కావచ్చు. బీ బోల్డ్'' అని భుజం మీద తట్టి వెళ్ళిపోయారు.

★ ★ ★

ఎగ్జామ్స్ అయిపోయాయి. తల మీంచీ పెద్ద బరువు తీసేసినట్టైంది నాకు. బాగా రాసానని చెప్పినా స్నిగ్ధ బాగా డిప్రెసైంది. విజయం మనోక్కర్నే వరించడంలేదు. సామర్ధ్యం లేని వారి మధ్య పోరాటానికి నిలబెట్టడం వేరు. పునీతతో ఫస్టురేంకు విషయంలో ఎంతో స్పోర్టివ్‌గా వుండే స్నిగ్ధ యిప్పుడు మాత్రం వుక్రోషంతో రగిలిపోతోంది.

రిజల్ట్స్ రోజు అందరం స్కూలుకి రావాలని నిర్ణయించుకుని విడిపోయాం. ఈ అన్ని రోజుల్లోనూ పునీత ఒక్కసారైనా మాకు కలవలేదు. సరిగ్గా టైమ్‌కి తీసుకొచ్చి, ఎగ్జామవ్వగానే ఒక్క నిముషం వేస్టవ్వకుండా తీసుకెళ్ళిపోయేవారు వాళ్ళ డేడీ. ఈరోజు మాతోనే వున్నా డల్‌గా వుంది. పెద్దగా ఎవర్తోనూ మాట్లాడలేదు.

''రేంకు రాదని భయపడ్తోందేమో!'' అంది స్నిగ్ధ నాకే వినిపించేలా.

అందరం విడిపోయాం.

సరిగ్గా నెలరోజులకి రిజల్ట్సొచ్చాయి. ఈలోగా ఎన్నో బుక్స్ చదివాను. కేసెట్స్ విన్నాను. మధ్యమధ్యలో స్నిగ్ధ ఫోన్ చేస్తోంది. విజయవాడలోని ఫేమస్ రెసిడెన్షియల్ కాలేజీలో సీటుకోసం ఎంట్రెన్సుకి ప్రిపేరౌతున్నానంది. కోచింగ్ కూడా తీసుకుంటోందిట.

''మరి నువ్వు?'' అడిగింది నన్ను.

''వేరే ఆలోచనేదీ లేకుండా బిట్స్‌కి ఎయిమ్ చెయ్యమంటున్నారు నాన్న. అక్కడ రాకపోతే బియ్యెస్సీ, ఎమ్మెస్సీ, మేథ్స్ ఎవ్వర్‌గ్రీన్ సబ్జెక్టట. టీచింగ్‌లైన్లోకి వెళ్తే మంచి ప్రాస్పెక్ట్సుంటాయని చెప్పారు''

''నువ్వెప్పుడూ అంతే. కాంపిటీషన్స్‌లో తల దూర్చకుండా సైలెంట్‌గా నీ గోల్‌ని కొడతావు''

''నా పోటీ నాతోటే వుండాలిట. అమ్మ చెప్పింది. పోయిన ఎగ్జామ్‌లో నైంటీ వస్తే ఈసారి నైంటీ వన్. అలా నన్ను నేనే బీటౌట్ చేసుకుంటూ ఒక సాచ్యురేషన్ పాయింటుకి వస్తే, మన కెరీర్ అదే తయారౌతుందట'' అన్నాను అమ్మ మాటలు పెద్దగా అర్థ

యస్.శ్రీదేవి

మవ్వకపోయినా, అమ్మ చెప్పింది కాబట్టి ఎప్పటి కేనా అర్థమౌతాయని నమ్మి.

★ ★ ★

రిజల్ట్సొచ్చాయి.

ఇంటర్నెట్‌లో చూసుకుని నమ్మలేకపోయాను. స్నిగ్ధదీ, పునీతదీ చూసాను. ముగ్గుర్లోకీ నాదే ఎక్కువ. ఎందుకనో పునీత బాగా వెనకబడింది.

ఇంట్లో చెప్పేసి, స్కూలుకి పరిగెత్తాను.

నాదే స్కూల్ టాప్. పిల్లలంతా నన్ను చుట్టుముట్టారు. కంగ్రాట్స్ చెప్తున్నారు. ప్రిన్సిపాల్ కూడా నన్ను కొత్తగా గుర్తించినట్టు అభిమానంగా మాట్లాడారు.

స్నిగ్ధకోసం వెతికాను. కనిపించలేదు. రేంకు పోయిందిగాబట్టి పునీత రాదని ముందే తెలుసు.

ఇంటికెళ్ళగానే స్నిగ్ధకి ఫోన్ చేసాను.

''నా యాక్టివా ఛాన్సు పోగొట్టేసావు'' అంది అలుకగా. నేను నవ్వేసాను.

కంగ్రాట్స్ చెప్పింది.

''నీకొస్తుందనుకున్నాను'' అన్నాను.

''ఒక్క మార్కేగా, మనిద్దరికీ తేడా?'' అంది.

''స్కూలుకెందుకు రాలేదు?''

''కొంచెం యిన్సల్టుగా అనిపించింది''

''ఇంట్లో కోప్పడ్డారా?''

''ఎందుకు? నాకేగా లాస్?''

''నేను కొనిస్తాలే.''

''ఏం పెట్టి''

''ఎక్కువొచ్చిన మార్కులు పెట్టి''

ఇద్దరం నవ్వుకున్నాం.

''ఒకటి రెండు రోజులు యిలాగే అంటారు నాన్న. తక్కువ మార్కులేం రాలేదు కాబట్టి తనే కొనిస్తారు'' అంది.

బై చెప్పి పెట్టేసాను.

మళ్ళీ వెంటనే పావుగంటకి రింగైంది. స్నిగ్ధే.

''నీకు తెలుసా? పునీత సూసైడ్ చేసుకుందట. వాళ్ళ డేడీ బాగా తిట్టారట. రేంకు పోయిందని'' తన గొంతు వణుకుతోంది. ఏడుపు మాటల్ని మింగేస్తోంది.

నేను షాకయ్యాను. చేతిలోంచీ రిసీవర్ జారిపోయి పెద్ద చప్పుడు చేసేసరికి అక్కడే వున్న అమ్మ చప్పుని నాకేసి తిరిగింది. ''స్వీటీ! ఏమైంది? ఏం జరిగింది?'' ఆదుర్దాగా అడిగింది.

''పునీత సూసైడ్ చేసుకుందట''

అమ్మ నిశ్చేష్టురాలైంది. నాన్న కూడా అంతే.

''ఏంటి ఈ రేంకుకే?'' అంది దిగ్భ్రాంతిగా.

పునీత వాళ్ళ డేడీకి భయపడ్తుందని తెలుసు. కానీ యిలా కూడా భయపెడ్తారా? ఇలాంటి నాన్నలుంటారా? నాకు రేంకొచ్చిన సంతోషం పోయింది. తప్పు చేసిన భావన. నాకొచ్చిన రేంకు నన్ను పాములా చుట్టుకున్నట్టనిపించింది. నాన్న నన్ను దగ్గరికి తీసుకోగానే ఏడ్చేసాను. మా ముగ్గుర్లో ఎవరికీ సంతోషమన్నది లేదు. హోటలూ లేదు. పార్టీ లేదు. సినిమా లేదు. రిజల్ట్సు రాగానే ఎప్పుడూ చేసే పనులన్నీ మర్చిపోయాము. అమ్మానాన్నలతో వెళ్ళి పునీతని చూసి వచ్చాను. స్నిగ్ధ, రాజీవి... యింకా చాలామంది ఫ్రెండ్సున్నారక్కడ. చాప మీద నిశ్చలంగా పడుకుని వుంది పునీత.

''దాన్ని చూడవే. ఇంక చదవక్కర్లేదే అది. ఫస్టు మార్కుపోతే ఏడవటం, టీచర్లతో పోట్లాడి మార్కులు వేయించుకోవటం ఏమీ వుండవే దానికి'' అని ఏడ్చింది స్నిగ్ధ.

''మా కూతురు స్కూల్ ఫస్టనీ, స్టేట్ రాంకరనీ గొప్పగా చెప్పుకోవాలనుకున్నాంగానీ యిలా చేస్తుందనుకోలేదు'' అని ఏడుస్తున్నారు పునీత మమ్మీ డాడీ.

నాకీ రేంకొద్దని పెద్దగా అరవాలనిపించింది.

''నేనే తన చావుకి పరోక్షంగా కారణమేమో?'' అంటే స్నిగ్ధ వప్పుకోలేదు.

''ఆ రేంకేమైనా తన దగ్గర్నుంచీ లాక్కుని నీకిచ్చారా? హార్డ్ వర్క్ చేసావు. వచ్చింది. చిన్న ఫెయిల్యూర్‌ని తట్టుకోలేకపోతే ఎలాగే?'' అంది.

మేం చాలా పెద్దవాళ్ళలా మాట్లాడుకున్నామట. ఇంటికొచ్చాక అమ్మ చెప్పింది. ''ఆపాటి మెచ్యూరిటీ వుండాలి'' అంది.

★ ★ ★

పునీత జ్ఞాపకం నన్ను వదలలేదు. డైవర్ట్ చెయ్యటానికని నాన్న ఎల్టీసీమీద మమ్మల్ని వైజాగ్ తీసికెళ్ళారు. అరకులోయ, సింహాచలం అవన్నీ చూసి వచ్చాము. బాగా తేరుకున్నాను. తిరిగొచ్చేసరికి లెటర్ బాక్స్ నిండా ఎన్నో వుత్తరాలు. ఫ్రీ సీటు, ఫ్రీ హాస్టల్ ఫెసిలిటీ యిస్తామని పెద్ద పెద్ద కాలేజీస్ నుంచీ ఆఫర్లొచ్చాయి.

''స్వీటీని ఎక్కడికీ పంపించను. ఇక్కడే వుండి చదువుకుంటుంది'' అన్నారు నాన్న. అమ్మానాన్నలని వదిలిపెట్టి వెళ్ళక్కర్లేదనుకుంటే రిలీఫ్గా అనిపించింది. వచ్చిన ఉత్తరాలని చూస్తూ అంది అమ్మ, ''ఇదంతా రేట్ రేస్. ఒక్కదాన్నొకటి దాటుకుంటూ ఎలుకలు పరిగెడుతుంటాయే, అలాంటిది. వాటికో గమ్యం వుండదు. ఐతే ఆ రేస్‌ని యిక్కడ పిల్లలు ఆడిస్తున్నాయి. పిల్లలేదో తమలోతాము పోటీలుపడి చదువుకుంటుంటే ఆ కాంపిటీటివ్ స్పిరిట్‌ని ప్రైవేట్ స్కూల్స్, కార్పొరేట్ కాలేజీలు, పేరెంట్సు అందరూ కలిసి కమర్షియలైజ్ చేస్తున్నారు'' అని.

ఆ మాటలు అర్థం కావడానికి నాకు చాలాకాలమే పట్టింది. ✤



## ఎంత మార్పు?

**అందాలరాశి ఇప్పుడు ఎంతో స్మార్ట్‌గా తయారైంది. 'ప్రస్తుత పరిస్థితుల్లో హీరోయిన్ల మధ్య పోటీ బాగా పెరిగింది. తమకున్న అందాన్ని పెంచుకోకుంటే ఇండస్ట్రీలో నిలదొక్కుకోలేం' అంటోంది రాశి. అందాలతార రాశి ఎలాగైతేనేం తొమ్మిది కిలోల బరువు తగ్గింది. ఇందుకోసం ఆమె రోజుకి రెండుగంటలు కేటాయిస్తోంది. అంతేకాదు ఓ ఫిజికల్ ట్రైనర్‌ని కూడా నియమించుకుంది. తెలుగులో మరిన్ని అవకాశాలు చేజిక్కుంచుకునేందుకు ఆమె ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలతో పాటు బాలీవుడ్‌లో ఛాన్స్‌ల కోసం ఆమె ట్రై చేస్తోంది.**